క్లుప్తంగా

సాగునీటిని జాగ్రత్తగా వాడుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ

గోస్పాడు: సాగునీటిని వృథాచేయకుంగా జాగ్రత్తగా వాడుకోవాలని ట్రైనీ డీఎస్పీ రాజా సింహారెడ్డి రైతులకు సూచించారు. మండల పరిధిలోని నెహ్రూనగర్ సమీపంలో కేసీ కెనాల్ కాల్వపై శనివారం పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కొందరు మోటార్లను ఉపయోగిస్తూ అక్రమంగా సాగునీటిని వినియోగించడం వల్ల సమస్య ఉత్పన్నమవుతుందని చెప్పారు. సాగునీటి సమస్యను రైతులు శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన కూచిపూడి వర్క్‌షాప్



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థినులు

నంద్యాల (వ్యవసాయం): ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నంది ఫైన్ ఆర్ట్స్ అండ్ ఆర్టిస్ట్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూచిపూడి వర్క్‌షాప్ సెమినార్ శనివారం ముగిసింది. నాట్య గురువులు సురేష్, మౌనిక మాట్లాడుతూ గత వారం రోజులుగా నంద్యాల స్టేట్ బ్యాంక్ కాలనీలో ఈ వర్క్‌షాప్ నిర్వహించామన్నారు. చివరి రెండు రోజులు చిన్నారులు అహోబిలం బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం జరిగిందన్నారు. అహోబిలం ఆలయ నిర్వాహకుడు మురళీశర్మ, జైబాలాజీస్వామి వారికి సర్టిఫికెట్లు అందజేసినట్లు వెల్లడించారు.

విద్యార్థులకు ప్యాడ్, ఫైల్స్ పంపిణీ



ప్యాడ్‌లు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): మండల పరిధిలోని చాపిరేవుల గ్రామం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు పూర్వ విద్యార్థి నాగసుబ్బరాయుడు ప్యాడ్‌లు, సర్టిఫికెట్లు భద్రపరుచుకునే ఫైళ్లు అందించారు. స్థానిక పాఠశాల ఆవరణలో హెచ్ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో 70 మంది విద్యార్థులకు వాటిని అందజేశారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో రాసి మంచి ఫలితాలు సాధించాలని సుబ్బరాయుడు ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజు, పూర్వ విద్యార్థులు రాజశేఖర్, ప్రసాద్, జీవరత్నం, చిన్న సుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



దొర్నిపాడులోని జెడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రం

దొర్నిపాడు: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ శివలక్ష్మి శనివారం తెలిపారు. దొర్నిపాడు జెడ్పీహెచ్ఎస్ నుంచి 108 మంది, భాగ్యనగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 42 మంది, అమ్మిరెడ్డినగరం కస్తూరిబా గాంధీ విద్యాలయం నుంచి 30 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు చెప్పారు. మొత్తం 180 రెగ్యులర్, కంపార్ట్‌మెంటల్ ఆరు మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు చెప్పారు. 9 గదులు ఏర్పాటు చేశామని అన్నిటిలో వెంటిలేషన్, విద్యుత్, ఫ్యాన్లు సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు.

చదువుల తల్లీ దీవించు



మాయలూరు ఉన్నత పాఠశాలలో సరస్వతి దేవికి పూజలు చేస్తున్న విద్యార్థులు

ఉయ్యాలవాడ : మండలంలోని మాయలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 17వ తేదీ 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్న విద్యార్థులు చదువుల తల్లి తమను దీవించలంటూ భక్తి శ్రద్ధలతో వేడుకున్నారు. అంతకు ముందు 9వ తరగతి విద్యార్థులు వారికి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఇన్నాళ్లు ఒకే పాఠశాలలో కలిసి మెలిసి చదువుకుని బయటకు వెళ్లిపోతుండడంతో కళ్ల నుంచి ఉబికి వస్తున్న కన్నీటిని దిగమింగుతూ నేస్తమా మళ్లీ కలుద్దామంటూ ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. తీపి గుర్తుగా ఉపాధ్యాయులతో కలిసి ఫొటో దిగారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని హెచ్ఎం మాబూ షరీఫ్, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

నేత్ర పర్వం..

ప్రణయ కలహోత్సవం

- అహోబిలంలో మార్మోగిన గోవింద నామస్మరణ
- శాస్త్రోక్తంగా తీర్థవారి చక్రస్నానం
- వైభవంగా ద్వాదశారాధనం
- కనులపండువగా పుష్పయాగం



ఉత్సాహంగా ఉభయదేవేరులతో ఊరేగుతున్న ప్రహ్లాద వరదస్వామి



ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతి



పుష్పయాగంలో కొలువైన స్వామి అమ్మవార్లు



స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

ఆళ్లగడ్డ: అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. గోవింద నామస్మరణ మార్మోగుతోంది. 11వ రోజైన శనివారం దిగువ అహోబిలంలో ప్రణయ కలహోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలన్ ఆధ్వర్యంలో సాగిన ఈకార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అంతకు ముందు ఉత్సవమూర్తులు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను ప్రత్యేకంగా అలంకరించి కోనేరు వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అక్కడ స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు మార్చి తిరుమంజనం సేవ దుస్తులు ధరింపజేసిన అర్చకులు.. స్వామి అమ్మవార్ల ఎదుట సుదర్శనమూర్తి, నిత్య అభిషేకమూర్తులను కలిపి పంచామృతాలతో అభిషేకించి, 108 కలశాలతో తిరుమంజనం నిర్వహించారు. అనంతరం సుదర్శనమూర్తికి, నిత్య అభిషేక ఉత్సవమూర్తికి కోనేరులో శాస్త్రోక్తంగా తీర్థవారి చక్రస్నానం చేయించారు. అర్చకులు, వేదపండితులు, ఆలయ అధికారులు, సిబ్బంది, వేలాది మంది భక్తులు ఈ ఉత్సవంలో పాలు పంచుకున్నారు.

వైభవంగా ద్వాదశ ఆరాధనం

బ్రహ్మోత్సవాల ముగింపు కార్యక్రమాల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం ద్వాదశ ఆరాధనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామికి ఆరాధన దోషాలను నివృత్తి చేసుకోవడం కోసం 12 మార్లు తిరువారాధన చేసి 12 రకాల భక్ష్యాలను (మిఠాయిలు) 12 రకాల అన్నం (వంటకాలు)తో ఉత్సవ మూర్తులకు నివేదించారు.

పూలు పరిమళించే.. భక్తులను తరింపజేసే

జయజయ నారసింహా నామ సంకీర్తనలు ప్రతిధ్వనిస్తుండగా.. దేదీప్యమానమైన విద్యుద్దీపకాంతుల వెలుగులో.. వేద పండితుల వేదోక్త మంత్ర పఠనాలు.. ఆస్థాన విద్వాంసుల మంగళకర వాయిద్యాల నడుమ శ్రీ ప్రహ్లాదవరదుడు దేవేరీ మహాలక్ష్మీల పుష్పయాగం వేడుక శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సమూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదుడిని యాగశాలలో కొలువుంచి ముందుగా అభిషేకం, అర్చనలు నవకలశ స్నపన, తిరుమంజనం నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను విశేషాలంకరణ గావించి దేశంలోని వివిధ ప్రదేశాలనుంచి తెప్పించిన 108 రకాల పూలు, పత్రాలతో అలంకరించిన యాగశాలలో కొలువుంచారు. అనంతరం విడిపూలతో స్వామి, అమ్మవార్ల పాదాల నుంచి హృదయం మునిగేంత వరకు పుష్పారాదన చేశారు. తరువాత దూపదీప నీరాజనాలు సమర్పించి పుష్పాలను పూర్తిగా తొలగించడం ఇలా ఇరవైసార్లు సుమధుర సుగంధాలు విరజిమ్మే పుష్పజాతులతో ఈ పుష్ప కైంకర్యం సుమారు 5 గంటల పాటు కనుల పండువగా నిర్వహించారు.

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తనివ్వొద్దు

- మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి

నంద్యాల: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్ధన్‌రెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో వేసవి తీవ్రత దృష్ట్యా రూరల్, అర్బన్ ప్రాంతాల్లో చేపట్టాల్సిన తాగునీటి సరఫరాపై సమావేశంలో చర్చించారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరైన ఈ కార్యక్రమంలో మంత్రులు మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో భూగర్భ జలాలు వేగంగా తగ్గిపోతున్నాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని వర్షాకాలం వచ్చే వరకు ప్రజలకు ఇబ్బంది లేకుండా తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 489 గ్రామ పంచాయతీల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. రిజర్వాయర్లలో ఉన్న నీటితో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపుకోవాలన్నారు. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లో దాదాపు 25 అడుగుల లోతులో భూగర్భ జలాలు ఇంకిపోయాయని నీటి వనరులను అన్వేషించి తాత్కాలిక నీటి సరఫరాపై ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. జిల్లాకు జెడ్పీ నిధులు రూ.కోటి మంజూరు చేస్తే గ్రామాల్లో నీటి సరఫరాకు వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా తీవ్రమైన నీటి ఎద్దడి ఉంటే పరిష్కారానికి సంబంధిత ఇంజినీర్ల నుంచి ప్రతిపాదనలు పంపితే నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, డీఆర్ఓ రామునాయక్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ల పరీక్ష



అధికారులతో మాట్లాడుతున్న డీఆర్ఓ రామునాయక్

నంద్యాల(అర్బన్): ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు(స్క్రీనింగ్ టెస్ట్) పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్ఓ రామునాయక్ అధికారులను ఆదేశించారు. నేటి ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకు జరిగే ఈ పరీక్ష నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాణ్యం వద్ద గల రాజీవ్‌గాంధీ మెమోరియల్ కళాశాల, నంద్యాలలోని మున్సిపల్ టౌన్‌హాల్ ఎదురుగా రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల, ఎస్‌బీఐ కాలనీలోని రామకృష్ణ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. అభ్యర్థులు 9 గంటల్లోపు కేంద్రంలోకి వెళ్లాలని, ఆ తర్వాత అనుమతించమని చెప్పారు.

హక్కులపై అవగాహన పెరగాలి

నంద్యాల(న్యూటౌన్): వినియోగదారులకు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని ఇన్‌చార్జి జిల్లా పౌర సరఫరాల శాఖ ఇన్‌చార్జ్ ఆఫీసర్ రాజునాయక్, సహాయ అధికారి రవిబాబు, ఫుడ్ సేఫ్టీ అధికారి రాముడు, తూనికల కొలతల జిల్లా అధికారిణి అనిత సూచించారు. నంద్యాల పట్టణంలోని టెక్కె మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు వినియోగదారుల హక్కుల దినోత్సవంపై శనివారం అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ అబ్దుల్‌ఖాదర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడారు. నాణ్యతలో, తూకాల్లో లోపాలుంటే ప్రశ్నించాలన్నారు. కార్యక్రమంలో సైన్స్ కో ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి, జిల్లా వినియోగదారుల అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌బాషా, ఆళ్లగడ్డ తాలూకా అధ్యక్షుడు విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ పక్కీర్ అహమ్మద్, బీవీ నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యత

- కర్ణాటక భక్తులతో మర్యాదగా వ్యవహరించండి
- శ్రీశైలంలో సత్రాల నిర్వాహకులతో సీఐ

శ్రీశైలం: శ్రీశైల మహా క్షేత్రంలో రానున్న ఉగాది మహోత్సవాలను దృష్టిలో ఉంచుకొని కన్నడిగుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, అలాగే క్షేత్ర పవిత్రతకు భంగం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ ప్రసాద్ రావు తెలిపారు. శనివారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో క్షేత్రవ్యాప్తంగా ఉన్న సత్రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ అన్ని సత్రాలు వారు నెల రోజుల బ్యాక్‌అప్‌తో కూడిన సీసీ కెమెరాలు, వాటిని మానిటరింగ్ చేయడం కోసం టెక్నీషియన్లను నియమించుకోవాలని సూచించారు. సత్రాల్లో వివిధ కేటగిరీలో ఉన్న గదుల పట్టికను రిసెప్షన్‌లో ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కువ మంది సత్రాల్లో సభలు సమావేశాలు నిర్వహించడం, గొడవలు పడడం వంటివి చేయరాదన్నారు. కర్ణాటక భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తుల పూర్తి వివరాలు ఆధార్ నంబర్‌తో సహా రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని చెప్పారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే.. పోలీసులకు సమాచారం అందజేయాలని ఆదేశించారు. సత్రాలలో భక్తులకు పెట్టే ఆహారాన్ని ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులతో తనిఖీ చేయించాలని సూచించారు.

మహానందిలో వేలాలకు స్పందన కరువు

మహానంది: మహానందిలో శనివారం నిర్వహించిన బహిరంగ, షీల్డు టెండర్ల వేలాలకు స్పందన కరువైంది. క్షేత్రంలోని పోచా బ్రహ్మానందరెడ్డి డార్మెటరీ భవనంలో ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వివిధ విభాగాలకు టెండర్లు నిర్వహించారు. నంద్యాల, గాజులపల్లె వైపు టోల్‌గేట్ల నిర్వహణ, భక్తులు పాదరక్షలు భద్రపరుచుకునేందుకు, బీఎస్ఎన్ఎల్ వద్ద ఉన్న మరుగుదొడ్ల నిర్వహణ విభాగాలు వాయిదా పడ్డాయి. మూడుసార్లు ఎవరూ పాల్గొనకుండా తక్కువ ధరలకు టెండరు కోట్ చేస్తే దేవస్థానం అధికారులే స్పందించి తక్కువ రేట్లకు ఇస్తారనే ఉద్దేశంతో కావాలనే కొందరు ప్రణాళికలు రూపొందించినట్లు చర్చించుకుంటున్నారు. వీటితో పాటు భూములు, ఎరువు విక్రయాల ద్వారా సుమారు రూ.1.60లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఏఈఓ ఎరమల మధు, ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తర్తూరు జాతరకు ప్రత్యేక కమిటీ నియామకం

జూపాడుబంగ్లా: ఏప్రిల్ 6వ తేదీ నుంచి ప్రారంభం కానున్న తర్తూరు జాతర నిర్వహణకు ప్రత్యేక కమిటీని నియమిస్తూ దేవదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మండడి నారాయణరెడ్డి, ఎ.ప్రభావతమ్మ, జి.లక్ష్మీదేవి, కె.వెంకటేశ్వర్లు, పరమేశ్వరయ్య, జె.వెంకటేశ్వ రమ్మ, డి.సుబ్బన్నను కమిటీ సభ్యులుగా నియమించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏప్రిల్ 6వ తేదీ నుంచి 15వ తేదీ సాయంత్రం వరకు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కొత్త సభ్యులు ఆదివారం తర్తూరు లక్ష్మీరంగనాథ స్వామి ఆలయంలో ప్రమాణస్వీకారం చేయనున్నారు.

మానసిక ఒత్తిడిని జయించాలి

నంద్యాల(న్యూటౌన్): పదవ తరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడి, ఆందోళనకు గురికారాదని సమగ్ర శిక్ష ఏపీసీ కో ఆర్డినేటర్ ప్రేమాంతకుమార్, జీసీడీఓ నాగసువర్చల సూచించారు. శనివారం నంద్యాల కేజీబీవీ మైనార్టీ పాఠశాలలో కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపాళ్లు, ఏఎన్ఎంలు, పీఈటీలతో సమావేశం నిర్వహించారు. విద్యార్థినులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

ఫాంపాండ్స్ మంజూరు

శిరివెళ్ల: మండలానికి 13 ఫారం పాండ్స్ మంజూరయ్యాయని ఉపాధి హామీ పథకం ఏపీఓ రామసుబ్బయ్య శనివారం తెలిపారు. గుంప్రమాన్‌దిన్నె, మహాదేవపురం, శిరివెళ్లకు రెండు చొప్పున, కామినేనిపల్లె 3, మోత్కులపల్లె, చెన్నూరు, బోయలకుంట్ల, యర్రగుంట్లకు ఒక్కొక్కటి చొప్పున మంజూరయ్యాయన్నారు. ఫాంపాండ్స్ వల్ల భూ గర్భ జలాలు పెరుగుతాయని, తద్వారా రైతులకు ఎంతో ఉపయోగకరమని చెప్పారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు

గోస్పాడు: రాయితీపై వ్యవసాయ పనిముట్లు ఇస్తున్నామని, అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి తెలిపారు. గోస్పాడులోని స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ బ్యాటరీ స్ప్రేయర్లు, ధైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ పనిముట్లు, పవర్ విడర్లు 50 శాతం సబ్సిడీతో అందించనున్నట్లు చెప్పారు. 2024–25 సంవత్సరానికి గాను రైతులకు 50 శాతం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను సరఫరా చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. జిల్లా నుంచి రైతు సేవా కేంద్రాల వరకు వ్యవసాయ పనిముట్లు టార్గెట్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. గత ఐదేళ్లుగా వ్యవసాయ శాఖ నుంచి సబ్సిడీ ద్వారా పరికరాలు పొందని సన్న, చిన్నకారు రైతులు ప్రస్తుతం అర్హులన్నారు.

విద్యుత్ శాఖ సమస్యలపై వినతి

నంద్యాల(అర్బన్): విద్యుత్ శాఖల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యుత్ శాఖ 1104 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య కోరారు. స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా నంద్యాలకు వచ్చిన ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్‌ను శనివారం కృష్ణయ్య కలిసి సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేశ్వరరెడ్డి, నంద్యాల డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని జమ్మలమడుగు క్రాస్ రోడ్డు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆకుల శ్రీను (40) అనే వ్యక్తి మృతి చెందాడు. బాచ్చాపురం గ్రామానికి చెందిన ఇతను చిన్నకందుకూరులో బంధువు మృతి చెందడంతో వెళ్లి మోటార్ సైకిల్‌పై తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. పట్టణ సమీపంలో బైపాస్ రోడ్డు క్రాస్ చేస్తుండగా కడపవైపు నుంచి వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ చిరంజీవి తెలిపారు. మృతుడి కుటుంబ వివరాలు తెలియాల్సి ఉంది.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత





యర్రగుంట్ల ర్యాలీలో మాట్లాడుతున్న డ్వామా పీడీ, నంద్యాలలో స్టీల్ గ్లాసులు పంపిణీ చేస్తున్న దృశ్యం

దొర్నిపాడు:పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. మూడో శనివారాన్ని పురస్కరించుకుని నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అధికారులు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రధాన కూడళ్లలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

- మండలకేంద్ర దొర్నిపాడులో జరిగిన కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గోవిందునాయక్ పాల్గొని మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవన్నరు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సావిత్రి, కార్యదర్శి ఓబులేసు, నాగర్జున, మహేష్ తదితరులు పాల్గొన్నారు.
- శిరివెళ్ల: స్వచ్ఛాంధ్ర సాధనకు సమష్టి కృషి అవసరమని డ్వామా పీడీ వెంకట సుబ్బయ్య అన్నారు. శనివారం యర్రగుంట్లలో ఈ కార్యక్రమంపై అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులతో ర్యాలీ చేశారు. సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎంపీడీఓ శివ మల్లేశ్వరప్ప, తహసీల్దార్ పుష్పకుమారి, ఈఓ ఆర్డీ శ్రీనివాసశర్మ, సర్పంచులు అయ్యలూరి సుభహాన్, సాలమ్మ, ఎంపీటీసీ జయరామిరెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు కమతం లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రిద్దాం

నంద్యాల(అర్బన్)/గోస్పాడు: ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిస్థాయిలో నియంత్రిద్దామని ఎంపీపీ ప్రభాకర్ పిలుపునిచ్చారు. ప్లాస్టిక్‌ను నియంత్రించి స్టీల్ గ్లాసులను వాడుదామంటూ శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో కార్యాలయ సిబ్బందికి స్టీల్ గ్లాసులు పంపిణీ చేశారు. స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో తగ్గించి ప్రత్యామ్నాయం వస్తువులను వాడాలన్నారు. కార్యక్రమంలో ఏఓ షాను, సిబ్బంది పాల్గొన్నారు.

- నంద్యాల పంచాయతీ రాజ్ జిల్లా కార్యాలయం వద్ద డీఏఓ శ్రీనివాసులు, డీఈలు సుధాకర్‌రెడ్డి, గంగాధర్, నాగరాజు, మురహరిరావు ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద చెత్తా చెదారం లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈలు సుధీర్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.
- రుద్రవరం: మండలంలో శనివారం అధికారులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు స్వచ్ఛత పనులు చేపట్టారు. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి పరిశుభ్రత ప్రాధాన్యతను వివరించారు. తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేయడంతో పాటు మొక్కలకు నీరు పోశారు.
- నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ పాల్గొని మాట్లాడారు. పర్యావరణానికి ప్రమాదకరమైన ప్లాస్టిక్ వాడకాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- డీఈఓ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో డీఈఓ జనార్దన్‌రెడ్డి పాల్గొని పరిసరాలను శుభ్రం చేయించి విద్యార్థులతో మొక్కలు నాటించారు. కళాశాలలను ప్రతి ఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.
- చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఈఓపీఆర్‌డీ తాహెర్ హుసేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛత దివస్‌లో జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, మండల ప్రత్యేక అధికారిణి లక్ష్మీదేవి పాల్గొని మాట్లాడారు. అంతకుముందు మెయిన్ బజారు నుంచి ర్యాలీగా ఈద్గా వద్దకు వెళ్లి అక్కడ పరిసరాలను శుభ్రపరిచారు.

స్ఫూర్తిదాయకులు రేనాటి సూర్యచంద్రులు



బుడ్డా వెంగళరెడ్డికి విక్టోరియా మహారాణి బహూకరించిన బంగారు పతకాన్ని పరిశీలిస్తున్న జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్

ఉయ్యాలవాడ : రేనాటి సూర్యచంద్రులైన విప్లవ వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, పేదల ఆకలి తీర్చిన కలియుగ దానకర్ణుడు బుడ్డా వెంగళరెడ్డి స్ఫూర్తిదాయకులని ఉమ్మడి కర్నూలు జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారిణి, మండల ప్రత్యేకాధికారిణి సబిహా పర్వీన్ అన్నారు. వీరిద్దరు ఒకే గ్రామంలో జన్మించడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. శనివారం బుడ్డా వెంగళరెడ్డి వారసులైన బుడ్డా విశ్వనాథరెడ్డి గృహానికి ఆమె వెళ్లారు. 1866లో డొక్కల కరువు సంభవించినప్పుడు నాలుగు జిల్లాల ప్రజలకు ఆకలి తీర్చిన తీరును బుడ్డా విశ్వనాథరెడ్డి ఆమెకు వివరించారు. బుడ్డా వెంగళరెడ్డి దాతృత్వాన్ని మెచ్చి నాడు విక్టోరియా మహారాణి ఆయనను సన్మానించి బంగారు పతకాన్ని అందజేసిందని తెలిపారు. కార్యక్రమంలో బుడ్డా సదాశివారెడ్డి, బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, మండల కోఆర్డినేటర్ రమణారెడ్డిలె పాల్గొన్నారు.



శ్రీరంగాపురం సమీపంలో 17వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వకు భారీ గండి (ఇన్‌సెట్‌లో) గండిని పూడ్చుకుంటున్న రైతు, దిగువకు నీటి ప్రవాహం లేని దృశ్యం

తెలుగుగంగ కాల్వకు గండ్లు

- దిగువకు పారని నీరు
- పట్టించుకోని టీజీపీ అధికారులు
- ఆందోళనలో రైతన్నలు

రుద్రవరం: మండలంలోని శ్రీరంగాపురం వద్ద తెలుగుగంగ 17వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వకు శనివారం రెండు చోట్ల గండ్లు పడ్డాయి. దీంతో కాల్వకు వదిలిన నీరంతా మధ్యలోనే వృథాగా పోతుండటంతో చివరి ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ కాల్వ కింద దాదాపు 500 ఎకరాల్లో వరి, మినుము, మొక్కజొన్న తదితర పంటలు సాగయ్యాయి. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉంది. నీటి తడి చాలా అవసరం. అయితే, కాల్వ గట్లు సరిగా లేకపోవడంతో తరచుగా గండ్లు పడుతున్నాయి. పలుసార్లు రైతులే చందాల వేసుకొని పూడ్చుకుంటున్నారు. తాజాగా పెద్ద గండ్లు పడటంతో వాటిని పూడ్చి నీటి వృథాను అరికట్టాలని తెలుగుగంగ ప్రాజెక్టు అధికారులకు విన్నవించగా తామేమి చేయలేమని చేతులెత్తేసినట్లు రైతులు వాపోతున్నారు. ఇలా అయితే, తాము పంటలు పండించుకునేదెలా అని ప్రశ్నిస్తున్నారు.